కథ

# ఆచంట హైమవతి

# ఒకరికొకరు

“పోనీ...ఎవరూ వద్దులే. మనమే పనిమనిషి సహాయంతో సర్దుకుపోదాం. డెలివరీ అయిన తర్వాత మనవాళ్ళకి తెలిపితే సరి” అన్నాడు దివాకర్.

“అమ్మో...ఇంకేమైనా ఉందా? అమ్మ నన్ను క్షమించదు” గుండె మీద చెయ్యేసుకుంటూ అంది అనన్య.

“సరేలే..ఏం చేద్దామంటావ్? అలా వాయిదా వేసి, వేసి ఆరు నెలలు గడిపేశావ్! రెండుసార్లు ఆ ఊరు వెళ్ళి కూడా మీవాళ్ళ ఇంటికెళ్ళకుండా ఉండటానికి నేనెన్ని అబద్ధాలాడవలసి వచ్చిందో తెలుసా?” కినుకగా అన్నాడు దివాకర్.

అలిగినట్లు మూతి విరిచింది అనన్య. నవ్వుకున్నాడు దివాకర్.

“సరే... టైమవుతోంది. నేనొస్తామరి. నువ్వెలా అంటే అలాగే. ఏదో ఒకటి నిర్ణయించు” అని వెళ్ళబోతూ “టెన్షన్ పడిపోకు డియర్. నేను కూడా ఆలోచిస్తాన్లే!” బుజ్జగింపుగా భార్య తల నిమిరి ఆఫీసుకి వెళ్ళిపోయాడు దివాకర్.

ఆలోచనలతో సతమతమౌతూ వంట పూర్తిచేసింది అనన్య. పనిమనిషిని పిలిచి “పన్నెండున్నరైంది. స్కూలునుంచి బాబుని తీసుకురా” అని పురమాయించింది.

ooo

అనన్యకి తల్లిదండ్రులంటే చాలా ఇష్టం, గౌరవం. అలాగే అత్తమామలన్నా కూడా. వాళ్ళ మాట వేదంలా పాటిస్తుంది. ఒకే ఒక విషయంలో వాళ్ళ అభిప్రాయాన్ని అతిక్రమించింది. అంటే...అతిక్రమించక తప్పలేదు గనుక అతిక్రమించింది. ఇంకెప్పుడూ ఇంకే విషయానికీ అతిక్రమించదుకాక అతిక్రమించదు. అంతే! ‘శిలాశాసనం’ లాగ మనస్సులో మళ్ళీ మళ్ళీ నిశ్చయించుకుంది. భర్త ‘టెన్షన్ పడద్దు’ అన్నాడు గాని - అది సాధ్యంకావటం లేదామెకి.

అసలు సంగతేమిటంటే....? అనన్య తల్లిదండ్రులకి ఒక్కతే కూతురు. కావాలనే ఒకే కూతురుతో సరిపెట్టుకున్నారు వాళ్ళు. ఆ పై తరమూ అంతే. అనన్య తల్లి కూడా వాళ్ళవాళ్ళకి ఒకే సంతానం. సామాన్య సంసారులం కదానని పొదుపు దృష్టిలో సంతానాన్ని కూడా ఒకటినే కని, చేర్చిన ఆస్తి ఆ పిల్లకే అప్పగించారు.

అనన్య తండ్రి కూడా తల్లిదండ్రులకొక్కడే. వారు కోటీశ్వరులు కాదు గాని భాగ్యవంతులలోనే లెక్క. అయినా...ఆ భాగ్యం భాగాలు కాకూడదని అంతా ఆ కొడుకొక్కడే అనుభవించాలని వారి ఆశ.

దివాకర్ కూడా వాళ్ళవాళ్ళకి ఒక్కడే కొడుకు. పొలాలు, భవనాలు, బోలెడంత బ్యాంక్ బ్యాలెన్స్. ఎలా ఖర్చు చెయ్యాల్రా? అని ఆలోచించాల్సొచ్చేటంతటి స్థితిలో ఉన్నారు.

అనన్య తల్లి “నీ అదృష్టం వల్ల నీకు మొదటే కొడుకు పుట్టేశాడు. నాకు ముందు నువ్వు పుట్టినందుకు బంధుమిత్రులు తొలిచూలు ఆడపిల్లైతే మలిచూలు తప్పక మగబిడ్డే పుడతాడు అంటూ సలహాలిచ్చారు. అయినా మేము వినలేదు. ఆడపిల్లవైనా నువ్వే చాలనుకున్నాం. పిల్లల్ణి అపురూపంగా పెంచుకోండి. నాలుగు వైపులనుంచీ కూడిన సంపదంతా బంగారు బాబు శ్రీవాన్‌దే” మురిపెంగా మనవడి బుగ్గలు పుణుకుతూ అంది.

తల్లికి ఎదురు జవాబివ్వకుండా నవ్వేసి ఊరుకుంది.

“వాళ్ళందరితో ఆటలేమిటి నీకు?” అంటూ తనని ఎక్కువ అపురూపం చేసేసి ఎవరితోనూ కలవనిచ్చేవారు కాదు.

తోబుట్టువులున్న తన మిత్రుల్ని చూసి తనూ అసూయ పడేవాడు. వాళ్ళలాగ ఆ మాట పైకి చెప్పే ధైర్యం ఉండేది కాదంతే! వాళ్ళు మాత్రం “నీకేం లేరా” అనేసేవారు అతి తేలిగ్గా. ఇప్పటికీ ఆ చిన్ననాటి బెరుకు పూర్తిగా పోలేదు దివాకర్‌లో. మొహమాటం ఎక్కువ.

ఇంచుమించు ఇలాంటి విషయాలే అనన్య కూడా భర్త దగ్గర చెప్తూండేది. చవకగా వచ్చే అలంకార సామాగ్రి చాలా సున్నితంగానూ, కళాత్మకంగానూ ఉండేవి. అవి కొని అలంకరించుకోవాలని ఉండేది అనన్యకి. “నా కూతురు అందరిలా చవక సామాను పెట్టుకోవటం ఏమిటి? నీకు అలాంటివి బంగారపువే చేయిస్తాను” అని కొని నమూనా పట్టుకెళ్ళి బంగారంతో చేయించింది అనన్య తల్లి. నమూనా కోసం కొన్నవి చాలా నచ్చాయి అనన్యకి. కాని...వాటిని పెట్టుకోనివ్వలేదు తల్లి.

కొసరి, కొసరి బంగారం ఎక్కువేసి మోటుగా, మొద్దుల్లాగా చేసిచ్చాడు వాటిని కంసాలి. బాగా డబ్బు ఖర్చు అయింది కాని “అసలే నా చెవులు పల్చన. ఆ బరువు నా చెవులకి తగిలించుకుని మొయ్యలేను బాబూ! చెవికట్లు కూడా సాగిపోతాయి” అని అనన్య వాటిని అలంకరించుకోనేలేదు. లోపలే ఉంచేసింది.

ముప్ఫై, నలభై రూపాయల్లో కొని సరదాగా మనసు తీర్చుకొనే బదులు ఇంత హంగామా అవుతుందని అనన్య తన కోరికలే తెలపటం మానేసింది. తనతోటివారు సామాన్యంగా ఉంటూనే తనకంటే సంతోషంగా ఉంటున్నారని అనన్య అభిప్రాయం.


ఒక్కతేగదా..అంటూ గొప్పగానూ, విలువగానూ జరిపించటమేగాని, ఆమెకు కావలసినదేమిటో ఆమెను అడిగేవారూ కాదు. ఆ ఆశలు తీర్చేవారూ కాదు. తనకి సపోర్ట్‌గా ఉండేందుకు తోబుట్టువులు లేరనీ..తనతో వంతులాడేందుకు, వాదించేందుకు, పోటీపడేందుకు ఇంట్లో మరొకరు లేకపోవటం చాలా వెలితిగానే ఉండేది అనన్యకి. ఎందరికో ఉన్న అతిసామాన్యమైన ‘జతో...‘తోడు’ తనకి లేవని అశాంతిగా బాధపడేది. తనలో తను కుమిలి, కుమిలి ఏడ్చేది ఒక్కోసారి.

కుంది అనన్య. మంచిపని అనుకున్నది చెప్పకుండా చెయ్యటమే మంచిదని ఆమె అభిప్రాయం. “చర్చల్లో పడి రచ్చకెక్కే బదులు గప్..చిప్‌గా పని సాధించాలి” అదే ఆమె చేసింది. కొడుక్కి నాలుగేళ్ళు నిండగానే మలి శిశువును కనాలని తీర్మానించుకుంది. దానికి దివాకర్ కూడా పూర్తి మద్దతు పలికాడు.

దానిక్కారణం..దివాకర్ కూడా అనన్యలాగే ఒంటరితనంతో బాధపడేవాడు. దాన్ని మించిన ఇంకో బాధేమిటంటే “నీకేంరా? ఏకైక ముద్దుబిడ్డవి. నువ్వు కోరాలేగాని కొండమీద కోతి దిగొస్తుంది. మా ఇంట్లో అలా కాదే..ఏమడిగినా-చెల్లి, అక్క...అందరికీ నీలాగే కొనాలిగదా! అంత స్తోమత నాకు లేదు కనుక...అంటూ నీతులు. మొత్తానికి ఏదీ ఉండదు” అంటూ మిత్రులు అతనితో పోల్చుకుని అసూయపడి దివాకర్‌ని దూరంగా ఉంచటం తరుచు జరుగుతుండేది. చిన్నప్పుడు చుట్టాలొస్తే ఇల్లు సందడిగా ఉంటుందని సంతోషపడేవాడు దివాకర్.

బంధువుల పిల్లలతో కూడా చనువుగా ఆడనిచ్చేవారు కాదు అతని తల్లిదండ్రులు. వాళ్ళతో ఆడుకోవటానికి పెద్దగా పేచీ పెట్టాల్సొచ్చేది దివాకర్‌కి. నిజానికి పేచీ పెట్టటం అనే ప్రక్రియ దివాకర్‌కి అప్రియమై

ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన



ఒక్కత్తే ఉండటం అందరి దృష్టిలోనూ అపురూపం. కాని అనన్య దృష్టిలో అదే ఒక రకమైన 'లేమి' అన్న సంగతి ఎవరికీ తెలియదే?

దివాకర్, అనన్య భార్యాభర్తలు కావటం ఇద్దరి అదృష్టమూను. ఎందుకంటే...ఇద్దరి అనుభవాలు, భావాలు కలవటం సామాన్యంగా జరగదు. 'తన భార్య తోబుట్టువులనే తన వాళ్ళనుకోవచ్చు' అనుకున్న దివాకర్‌కి అనన్య కూడా తనలాగే ఏకైక సంతానం కావటం అసంతృప్తే కలిగించింది. ఆ విషయమే తల్లిదండ్రులకి ఆనందదాయకం కావటంతో ఇంకేమనలేక ఊరుకున్నాడు దివాకర్. పూర్తి విరుద్ధమైన విషయానికి తల్లిదండ్రులతో వాదించటానికి అంగీకరించలేదతని మనసు. మొదటి నుంచి అతడు మృదుహృదయుడు. తనలాగే మృదుమనస్విని, అందాలరాశి అనన్యని వదులుకోవటం కూడా ఇష్టం లేదతడికి. అలా వారిద్దరూ దంపతులయ్యారు. ఎవరికి వారు 'పోనీ మనం కందాం ఇద్దరు...ముగ్గుర్నైనా' అనుకున్నారు.

రెండు వైపుల పెద్దవారూ కూడా 'తమలాగే తమ బిడ్డలూ తమను అనుకరిస్తారు' అనుకున్నారే గాని మరొకలా అవుతుందని ఊహించలేదు కూడా!

○○○

బాబుకి బువ్వ తినిపించి నిద్రపుచ్చింది అనన్య. తను కూడా తిని విశ్రాంతిగా నడుము వాల్చింది. కాని నిద్ర పట్టలేదామెకు. తన కానుపు సంగతి, అత్తమామలు, తల్లిదండ్రులు ఎలా స్పందిస్తారో. వాళ్ళని ఎలా ఎదుర్కోవాలో?...ఇవే ఆలోచనలు బుర్ర తినేస్తున్నాయి. తను తప్పు చెయ్యటం లేదు అని మాత్రం మనస్ఫూర్తిగా నమ్మిందామె.

"మా ఆయన మద్దతుండగా నాకేం భయం? కంటాను. పెంచుతాం..అంతే!" మనస్సులో గట్టిగా అనుకొని నిద్రకై ప్రయత్నించసాగింది. అలా ఆమె అనుకోటం ఎన్ని వందలసారో!

కునుకు పట్టబోతుండగా ఆటో ఆగిన శబ్దం, గేటు తీసిన చప్పుడు- ఆ వెంటనే కాలింగ్ బెల్ మోత.

లేచి గది కిటికీ తెర వెనుకనుంచి చూసిన అనన్యకి 'షాక్'.

'బాబోయ్..ఇప్పుడెలా అమ్మ-నాన్న వచ్చేశారు. ఏమిటి ఈ ఆకస్మిక ఆగమనం?' మెదడంతా ఖాళీ అయిపోయిన భావన.

పేపరు కడుపునకు అడ్డంగా పెట్టుకుని చదువుతూ వచ్చినట్లు 'ఎంతసేపు దాగుతుంది తన గర్భం...?' చెవుల్లో వేడి ఆవిర్లొస్తున్నాయ్.

"చూడాలని పించి హఠాత్తుగా బయల్దేరాం. నీకు సర్ప్రైజ్ చేద్దామని ఫోన్ కూడా చెయ్యలేదు" అంది అనన్య తల్లి.

○○○

"మీ అత్తమామలకి తెలుసా ఈ విషయం?" రౌద్రంగా ఉన్న మొహంతో గద్దిస్తున్నట్లు అడిగింది అనన్య తల్లి. మాట్లాడకుండా తల అడ్డంగా ఊపింది అనన్య.

'ఆయన ఒచ్చేస్తే బాగుండును. నాకు ధైర్యం చాలటం లేదు. నైపుణ్యంగా వాదించగలరు ఆయనే' మాటిమాటికీ అనుకుంటోంది తల్లిదండ్రులు ఎన్ని రకాల సాధిస్తున్నా పన్నెత్తి మాట్లాడకుండా గడుపుతు

న్నదామె. భయం. తత్తరపాటు పౌరుషాన్ని అణచివేస్తున్నాయి.

దివాకర్ కారు దిగి సరాసరి లోపలికొచ్చి అత్తమామల్ని చూసి, తడబడి సర్దుకుని మర్యాదగా వాళ్ళని పల్కరించాడు.

వాళ్ళు జవాబివ్వలేదుగాని అనన్య 'అమ్మయ్య' అనుకుంది.

"అది మూర్ఖరాలు. నీ బుద్ధేమైందయ్యా?" అనన్య తండ్రి అడిగాడు.

వాళ్ళ వాదనని ఎదుర్కోవటానికి మాటలు కూర్చుకుంటున్నాడతను. "మీకు ఇంకో బిడ్డ అంత అవసరమా?" నిగ్గ తీస్తున్నట్లు అడుగుతున్నారు అనన్య-దివాకర్‌లని. చెయ్యకూడని చాలా పెద్దతప్పు చేసినట్లుంది వాళ్ళ ధోరణి.

"అవునండి. మాకవసరమే! మూడో బిడ్డని కూడా కంటాము. బిడ్డలందరికీ ఒకరి అవసరం ఒకరికి ఉంటుంది" నిదానంగా చాలా స్పష్టంగా చెప్పాడు దివాకర్.

తెల్లబోయి ఒకర్నొకరు చూసుకుంటూ ఉండిపోయారు ఆ దంపతులు. 'ఎలా చెప్తే వీళ్ళకి అర్థమౌతుంది?' అని వీళ్ల గురించి వాళ్ళు, వాళ్ళ గురించి వీళ్ళు ఒకేలాగా అనుకున్నారు మనసులో.

కొన్ని వాదోపవాదాల అనంతరం చివరి అస్త్రం ప్రయోగించారు అనన్య తల్లి-తండ్రి.

"మేము కూడా మీలాగే అనుకుని పదిమంది పిల్లల్ని కనిపారేస్తే..మీకు ఈ కార్లు, ఈ మేడలు, మీకింత ఖరీదైన జీవితం ఉండేవా? మేం పొదుపుగా..మీకోసం.."

'అందరూ తామేదో త్యాగం చేసేశామనుకుంటూ ఇవతలవాళ్ళని తమ గుప్పెట్లో పెట్టుకుందామనుకుంటారు. వీళ్ళూ అంతే!' అనుకున్నాడు దివాకర్ మనసులోనే.

అత్తగారి మాటలు పూర్తి కాకుండానే మధ్యలో అందుకుంటూ "పొదుపు అవసరమే. పదిమంది పిల్లల్ని మేమూ కనం! అదుపు లేనంత పొదుపు అనవసరం అత్తయ్యా. మా జతకి మీరు...అంటే అదే మా పై తరం మరికొంత ఉదారంగా ఆలోచించి ఇంకొకర్నైనా కని ఉంటే పరిస్థితి సామాన్యంగానే ఉండేది. నాకు గాని, అనన్యకి గాని ఇంకొక తోబుట్టువు ఉంటే...మాకు ఇలాగ ఇద్దర్నో, ముగ్గుర్నో కనాలనే కోరిక రాకపోనేమో! కజిన్స్ కూడా లేకపోవటంతో మాకు ఏదో వెలితి భావన. మా ఇద్దరికీ కూడా ఈ ఒంటరితనం అసంతృప్తే కాదు అసహ్యం కూడా. సంపద కూడబెట్టి ఒక్కరికే ధారపోసి, సుఖ శిఖరాలకు ఎక్కించెయ్యాలనే తాపత్రయం మీకు, అదంతా తామొక్కరే అనుభవించాలనీ, ఇంకెవరికీ పంచే అవసరం ఉండకూడదనీ పిల్లలు అనుకుంటున్నారు. తల్లిదండ్రులు తమకోసమే కూడబెట్టారు కనుక అదంతా తమకేనని అనుకుంటూ ఆ కూడవేసిన తల్లిదండ్రులనే అశ్రద్ధ చేస్తున్నారు. వారికి అండగా ఉండటం పూర్తిగా మానేస్తున్నారు" అంటున్న దివాకర్ మాటలు వారిద్దర్నీ ఆలోచనల్లోకి దింపాయి.

"ఇద్దరు పిల్లలైనా ఉంటే ఒకరు కాకపోతే ఇంకొకరికైనా తల్లిదండ్రుల్ని ఆదరించాలనిపిస్తుంది గదా! ముసలితనంలో చేయూత లభిస్తుంది గదా! లెక్కలేనంత సంపద చేతికందటంతో వాళ్ళు కొంచెం స్వతంత్ర్యం లభించేసరికి విచ్చలవిడిగా ప్రవర్తించటం, దుర్వ్యసనాల పాలై..అనంతరం వాళ్ళు ఎందుకూ కొరగాని వ్యర్థులైపోవటం! ఎంత బాధాకరమైన సంగతి?"

"ఎందుకొచ్చిన ఒంటరి సంపదలండీ ఇవి?" అత్తమామలు మాట్లాడబోతున్నది ముందే గ్రహించిన దివాకర్ "ఆగండి. నేను చెప్పటం యింకా పూర్తి కాలేదు" అని చెప్పి తిరిగి తన సంభాషణ సాగించాడు. మెచ్చుకోలుగా తలాడించి ప్రోత్సాహంగా సైగ చేసింది అనన్య.

"మనిషి సుఖంగా ఉండటానికి, సంతోషంగా జీవించటానికి డబ్బు అవసరమే. అది నేనూ ఒప్పుకుంటాను. కాని...? మనిషికి మనిషి తోడు కాకుండా-సంపద ఒక్కటే తోడై మూల్గుతూంటే అది మనిషికి ఆపద కూడా తెచ్చిపెడుతుంది"

"ఎంత స్వార్థంగా ఆలోచించినా..రక్తసంబంధం రక్తసంబంధమే! ఆపదలలో..కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచి సాయం చేసుకుంటే, ఒకరికొకరు ధైర్యం చెప్పుకుంటే..ఆ స్థితి..ఎంత తృప్తిగా ఉంటుంది? ఆ స్థితిని మాటలతో వర్ణించి చెప్పగలమా? మీరు ఆ అదృష్టాన్ని మాకు దూరం చేశారు" అలా చెప్తుంటే అతని గొంతు గద్గదికమైంది. కళ్ళు చెమ్మగిల్లాయి. తనను తాను కంట్రోలు చేసుకుందుకు వెనక్కి తిరిగి నుంచున్నాడతను.

సరికొత్త పాఠం వింటున్నట్లు కళ్ళు విప్పార్చుకుని నిశ్శబ్దంగా ఉండిపోయారు అనన్య తల్లిదండ్రులు.

"మీరు చెప్పిన మాట వినలేదు కాబట్టి..మీకు మేము సాయం చెయ్యము. ఆస్తి ఇవ్వము అంటారా? ఫరవాలేదు. అనన్య నేనూ ఒకరికొకరం ఉన్నాం. మాకు మేం సరిచూసుకోగలం. మీరు దయతలచి ఇచ్చిన చదువు, తెలివి ఉన్నాయి గదా! ఏదో...సంపాదించుకుని బతికేయగలం! రేపు మావాళ్ళొచ్చి అడిగినా నేను ఇదే జవాబు చెప్తాను"

"మాకు తోబుట్టువులు ముచ్చట తీరలేదు. మా పిల్లలకి ఆ కొరత ఉండదు. మిమ్మల్ని నొప్పించాలని నేను ఇదంతా చెప్పలేదు. మీ ఆలోచనల్లోకి రాని విషయాలు, మా కోరిక, విడమర్చి చెప్పాలని ప్రయత్నించానంతే. ఈ విషయం ఇంతటితో ఆపేద్దాం!" అని చెప్పి "అనన్యా అందరికీ టీ కలుపు. నేను బట్టలు మార్చుకుని వస్తాను" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు దివాకర్.

నిశ్శబ్దంగా ఉన్న తల్లిదండ్రుల్ని ఓరకంట చూస్తూ 'బతుకు జీవుడా' అనుకుంటూ వంటింట్లోకి పారిపోయింది అనన్య. మబ్బులు తొలగిన వెన్నెలలా అనన్య మనసిప్పుడు భారం తొలగిన ఆనందంతో ఉరకలు వేస్తోంది.

బొజ్జలో ఉన్న చిట్టితల్లి కూడా ఉత్సాహంగా కదిలింది అమ్మని అభినందిస్తున్నట్లుగా!

## కుబేరుడంతటి కుచేలుడు

రజనీకాంత్ కొత్తగా నటిస్తున్న సినిమా 'కుచేలుడు' (తమిళంలో 'కుచేలన్')లో ఆయన కనిపించేది కొద్దిసేపేనట. అంటే ఫుల్ ఫ్లెడ్జెడ్ హీరో కాదట. కేవలం రెండు మూడు సీన్లలోనే కనిపిస్తాడట ఆయన.. అందుకనే ఈ సినిమాని 30 కోట్ల బడ్జెట్‌లోనే పూర్తి చేస్తున్నారట. అయితే 64 కోట్లకి అమ్మేయడం కూడా ఐపోయిందిట. రజనీకాంత్ పూర్తిస్థాయి హీరోగా నటించబోయే కొత్త చిత్రం 'రోబో' నిర్మాణం మెల్లగా జరుగుతోంది. హీరోయిన్ ఎవరనేది ఫైనలైజ్ కావాల్సి వుంది ఇంకా.

